క్లుప్తంగా

రేపు ఎమ్మెల్యేకు సన్మానం

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుకు ఈ నెల 9న మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భట్‌పల్లి చౌరస్తాలో గల మున్నూరుకాపు సంఘ భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

జెడ్పీటీసీకి పరామర్శ


జెడ్పీటీసీతో మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూర్: జెడ్పీటీసీ పంద్రం పుష్పలత ఇంట్లో పత్తి పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సుమారు క్వింటాలు పత్తి దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆదివారం జెడ్పీటీసీని పరామర్శించారు. ఇంటికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ డోకె వెంకన్న, ఎంపీటీసీ లంగారి శ్రీను, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ ఇస్తారి తదితరులు ఉన్నారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి


మాట్లాడుతున్న ట్రాక్టర్ డ్రైవర్లు

తిర్యాణి: యజమానులు పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నుంచి సమ్మె చేస్తున్నట్లు మండలానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు తెలిపారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానులు స్పందించాలని కోరారు.

అలరించిన కవి సమ్మేళనం


శ్రీనాథ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న కవులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సంగీత సాహిత్య సుధా వాహిని సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీమద్భగవద్గీత ఆధ్యాత్మిక కవి సమ్మేళనం అలరించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వాల్మీకి బోయ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమం చేయటం, అందులో శ్రీమద్భగవద్గీత కవి సమ్మేళనం నిర్వహించటం సమాజానికి ఎంతో అవసరమని సంస్థను కొనియాడారు. కవులు తమ కవితాగానం చేశారు. కార్యక్రమానికి హాజరైన కవులు, రచయితలకు శ్రీమద్భగవద్గీత గ్రంథం కానుకగా ఇచ్చి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు స్వరూపా పట్వర్ధన్, హైమావతి, రత్నజానకి, సృజన, సుశీల, పద్మ, విజయ్‌గౌడ్, రాజేశం, రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన కరెంట్ సరఫరా

బెల్లంపల్లి: కోతులు చేసిన చేష్టలతో ఆదివారం శాంతిఖని భూగర్భ గనికి అరగంటకు పైగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ పై గుంపులుగా చేరి కలబడడంతో ట్రాన్స్‌ఫార్మర్ పీజు కాలి పోయి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఒక కోతి మృతి చెందగా, సహచర కోతులు దానిని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు కార్మికులు చెప్పారు.

బ్రహ్మంగారి ఆలయ కమిటీ ఎన్నిక

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీని ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకునూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రేవల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా ముత్తోజు రాజు, ఎర్రోజు శ్రీనివాస్, వలబోజు రాజకిశోర్, కోశాధికారిగా పూసాల శ్రీనివాస్, కార్యదర్శులుగా పూసాల రాజేందర్, బోగోజు రవీంద్రచారి, కట్కోజుల నరసింహచారి, నర్సింగోజు చంద్రమౌళితో పాటు స్టీరింగ్ కమిటీ, యూత్ కమిటీని ఎన్నుకున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు ఆదివారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్, మాజీ సర్పంచ్‌లు లింగారావు, కాంతరావు, నాయకులు రాజన్న, సాదిక్, చెంద్రయ్య, సల్లు, సాగర్, మధు, రఘు పాల్గొన్నారు.

శిథిల భవనాల్లో పాలన

- ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు కరువు
- ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి
- అసౌకర్యాలతో ప్రజలతోపాటు అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు
- చింతలమానెపల్లి మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు


శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం

చింతలమానెపల్లి: పరిపాలన సౌలభ్యం, ప్రజలకు సేవలను చేరువ చేయడంతోపాటు స్థానికంగా డిమాండ్ మేరకు గత ప్రభుత్వం చింతలమానెపల్లి కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేసింది. 2016 అక్టోబర్‌లో సిర్పూర్ నియోజకవర్గంలో పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలాలు ఏర్పడ్డాయి. చింతలమానెపల్లి మండలంలో 19 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక పోవడంతో ప్రస్తుత భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాలు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయి. అసౌకర్యాలు, శిథిల గోడల మధ్య అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి.

శిథిల భవనాలు

మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలను నిర్వహిస్తున్న భవనాలు శిథిలావస్థలో ఉండటంతోపాటు అసౌకర్యాలకు నిలయంగా మారాయి. మండల పరిషత్ కార్యాలయ భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా.. ఉపయోగం లేకుండా పోయింది. కొద్దినెలల క్రితం వర్షాలకు కార్యాలయం వరండా సైతం కూలింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గదుల పైకప్పు నుంచి నీరు కారుతుంది.


పాఠశాల భవనంలో తహసీల్దార్ కార్యాలయం

తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసిన భవనం పాఠశాల పైగదిలో ఉండడంతో కార్యాలయానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లడానికి ఉపయోగించే మెట్ల గోడ కూడా శిథిలావస్థలో ఉంది. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎలాంటి వసతులు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతన మండలాలను ఏర్పాటు చేసిన అనంతరం మండల కేంద్రాల్లో అన్ని వసతులతో కూడిన కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదని, నివేదికలు అడగలేదని ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు అయినా అన్ని వసతులతో కూడిన భవనాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తాత్కాలిక భవనాల్లో కార్యాలయాలు

మండల పరిపాలనా భవనాలను తాత్కాలిక భవనాల్లో ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న పాఠశాల భవనానికి తరలించారు. పోలీస్‌స్టేషన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయగా.. అనంతరం శాశ్వత భవనాన్ని నిర్మించి అందులోకి తరలించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని శిథిలావస్థకు చేరిన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఇదే భవనంలో ఎంపీపీ, ఉపాధిహామీ కార్యాలయాలను సైతం నిర్వహిస్తున్నారు. వ్యవసాయ, విద్యా, ఇతర శాఖలకు ఇప్పటి కార్యాలయాలు కేటాయించలేదు. నేటికీ అవి కౌటాల మండల కేంద్రం నుంచే నిర్వహిస్తున్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

- నేడు కెరమెరి మండలంలో శోభాయాత్ర


అక్షింతలను కలశాల్లో నింపుతున్న భక్తులు

కెరమెరి: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతోపాటు ఆహ్వానపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేసేందుకు మండల కేంద్రంలోని శివాలయం ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 31 పంచాయతీల్లో 146 గ్రామాలు ఉన్నాయి. 10,600 కుటుంబాలు ఉన్నాయి. వీరికి సోమవారం పంచాయతీల వారీగా అక్షింతలు అందించనున్నారు. దీనిపై ఇప్పటికే సర్పంచులు, గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. అక్షింతలను తీసుకెళ్లేందుకు ఆయా గ్రామాల నుంచి 30 మంది చొప్పున మండల కేంద్రానికి రానున్నారు.

40 కిలోలు

ఒక్కో పంచాయతీకి కిలోకు పైగా అక్షింతలు అందించనున్నారు. ఇళ్లకు పంపిణీ చేసిన అక్షింతల్లో భక్తులు బియ్యం కలపాల్సి ఉంటుంది. మండల కేంద్రానికి మొత్తం 40 కిలోల అక్షింతలు వచ్చాయి. వీటిని 31 గ్రామ పంచాయతీలకు పవిత్ర కలశాల్లో నింపి పంపించనున్నారు. ఈ మేరకు కలశాల్లో అక్షింతలను ఆదివారం నింపారు. సుమారు 2000 మందితో సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించనున్నారు.

భక్తిశ్రద్ధలతో పంపిణీ



గ్రామాల్లో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టాలి. అయోధ్యంలోని శ్రీరామమందిరం నుంచి అందిన అక్షింతలను పవిత్రంగా భావించాలి. వీటిని ప్రతీ ఇంటికి చేర్చడం మన బాధ్యత.

– కులకర్ణి బాపూదేవ్, అర్చకుడు, కెరమెరి

కొనసాగుతున్న అక్షింతల పంపిణీ


కౌటాల మండలం తలోడిలో..


పట్నాపూర్‌లో శోభాయాత్ర

కౌటాల: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో ఆదివారం మండలంలోని తలోడి గ్రామంలో భక్తులు భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. అంతకు ముందు హనుమాన్ ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు చంద్రశేఖర్ శర్మ, నిర్వాహకులు ఎల్కా సత్యనారాయణ, బిట్టుపల్లి సంతోష్, ఉప్పుల వెంకటేశ్, నాగభూషణం, సాయి, ప్రదీప్ బాలయ్య, తిరుపతి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రం నుంచి అక్షింతలతో పట్నాపూర్‌లోని సిద్దేశ్వర్ సంస్థాన్ వరకు ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. గ్రామ పటేల్ పూసం హన్మంత్‌రావు, తదితరులు ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


ప్రేంసాగర్‌రావును సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

బెల్లంపల్లి: యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఏసీపీ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. యువకులను ఆకట్టుకునేలా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సీబీసీఐడీ రిటైర్డు అడిషనల్ ఎస్పీ పి.రవికుమార్ మాట్లాడుతూ.. క్రీడలకు బెల్లంపల్లి నిలయమన్నారు. సింగరేణి కార్మికులు, యువకులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన అనుభవం ఉందని గుర్తు చేశారు. క్రీడల్లో నైపుణ్యత ప్రదర్శించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహన్, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మంచిర్యాలటౌన్: జిల్లా చౌకధరల దుకాణం సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బొమ్మ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు సాగె బాపు, రాజారామ్, రామాంజనేయులు, శ్రీనివాస్, సత్యసాగర్, ప్రచార కార్యదర్శి అంకం మనోజ్, మంచిర్యాల డీలర్లు బానేష్, బూర్ల మహేందర్, అంకం తిరుపతి, ధర్మేందర్, గాండ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్లో జరిగే పీఎస్స్టార్ కరాటే కప్, కుంగ్‌ఫూ కప్ పోటీల నిర్వహణ పోస్టర్లను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఎం.నాగలక్ష్మి, ఆర్గనైజర్ మొకనపల్లి సరేష్, అడ్వైజర్ శశిధర్ మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి పలు విభాగాల్లో కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తన నివాసం ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల సదాశివ్, గౌరవ అధ్యక్షుడు గేడం జనార్దన్, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్, సహాధ్యక్షుడు రాథోడ్ ప్రకాశ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందిస్తున్న నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన సండే కోటేశ్ ఇటీవల మృతి చెందగా.. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బెజ్జూర్ మండల మాలీ సంఘం ఉపాధ్యక్షుడు చండే బాబురావు, నాయకులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిర్పూర్(టి): రమాబాయి మహిళా అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అధ్యక్షురాలు మౌల్కర్ లలిత, సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు


ఆపరేషన్ చేయించుకున్న వృద్ధులు

కౌటాల: కౌటాలలోని జాన్వీ విజన్ కేర్ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో పలువురు వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. ఇటీవల కాగజ్‌నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కౌటాలలో ఉచిత కంటిశిబిరం నిర్వహించారు. ఆపరేషన్లు అవసరమని గుర్తించిన 12 మందికి బెల్లంపల్లిలోని ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. ప్రతీ మంగళవారం జాన్వీ విజన్ కేర్ ఆస్పత్రిలో జేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ నారాయణ్ సర్కార్, సీమ సర్కార్ తెలిపారు.

చెత్తాచెదారం.. నిండా పూడిక


కొత్తగూడ వద్ద కాలువల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు

- బొక్కివాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు
- పదేళ్లుగా కాలువలకు మరమ్మతులు కరువు
- పొలాలకు సాగు నీరందక రైతులకు ఇబ్బందులు


ఎల్లూర్ వద్ద బొక్కివాగు ప్రాజెక్టు

పెంచికల్‌పేట్: ప్రాజెక్టులు, చెరువుల కాలువలకు ఏళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో పుష్కలంగా నీరున్నా పంటలు పండించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. రైతులు పొలాలు బీళ్లుగా వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల నిధులు లేక రైతులే మరమ్మతులు చేపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామం వద్ద బొక్కివాగుపై అప్పటి ప్రభుత్వం 2010లో రూ.17కోట్ల వ్యయంతో బొక్కివాగు ప్రాజెక్టు నిర్మించింది. 2500 ఎకరాలకు సాగు నీరందించాలనే సంకల్పంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. అయితే అప్పటి నుంచి కాలువలకు మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా పంట పొలాలకు సాగు నీరందడం లేదు. సాగు నీటిని పొలాలకు మళ్లించేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు.

వృథాగా సాగు నీరు

ప్రాజెక్టు ఆయకట్టు కింద కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 500 ఎకరాల్లో రైతులు యాసంగి సీజన్‌లో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రెండు కాలువల్లో చెత్తాచెదారం, పూడిక పేరుకుపోగా.. విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. మరోవైపు కాలువల సీసీ లైనింగ్ దెబ్బతిని గండ్లు పడుతున్నాయి. నీరు కాలువల నుంచి వృథాగా పోతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో కాలువల గండ్లను రైతులే మట్టితో పూడ్చి సాగునీటిని పంటలకు మళ్లిస్తున్నారు. అయినా సక్రమంగా నీటి ప్రవాహం లేకపోవడంతో కాలువల వద్ద పడిగాపులు కాస్తున్నారు. యాసంగి పంటలకు నీరందడం అనుమానంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా పంట పొలాలకు అందడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించాలి. బొక్కివాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. కాలువల గండ్లు పూడ్చి పొలాలకు సాగు నీరందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– లచ్చన్న, రైతు, ఎల్లూర్

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మండలంలోని కొలాంగూడ ఆదివాసీ గిరిజనులకు పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆదివారం రెబ్బెన ఎస్సై డి.చంద్రశేఖర్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి తీవ్రత పెరిగిందన్నారు. అటవీ ప్రాంతాల్లో నివాసం ఉండే గిరిజనులు చలితో పడుతున్న ఇబ్బందులను గుర్తించి పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా 50 మందికి దుప్పట్లు అందించామన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఎలాంటి సహాయం కావాలన్నా సంప్రదించాలని కోరారు. గ్రామంలో ఎలాంటి కష్టం ఉన్నా పరిష్కరించేందుకు పోలీస్‌శాఖ అందుబాటులో ఉంటుందన్నారు. గ్రామాల్లోకి అపరిచితులు, అసాంఘిక శక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక శక్తులకు సహాయం అందించవద్దని సూచించారు.

మేడిగూడలో కార్డన్‌సెర్చ్


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ, ఇద్దరు ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిసి ఉదయాన్నే గ్రామంలో ఇంటింటి తనిఖీలు చేపట్టారు. గుడుంబా తయారు చేస్తున్న గుల్వే రాహుల్ నుంచి 10 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 53 బైక్‌లు, 12 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ నాగేందర్ తెలిపారు. గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఐ ప్రేంకుమార్, నార్నూర్ ఎస్సై రవికిరణ్, గాదిగూడ ఎస్సై మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం


గోలేటి టౌన్‌షిప్‌లోని రామాలయానికి వెళ్లే రోడ్డుపై పందులు

రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని కార్మిక కాలనీల్లో పందుల బెడద పెరిగింది. కార్మికులు నివాసం ఉండే క్వార్టర్లతోపాటు దుబ్బగూడ, భగత్‌సింగ్ నగర్‌లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో తీసుకువచ్చి గోలేటి టౌన్‌షిప్‌లో వదులుతుండటంతో పందుల సంఖ్య విపరీతంగా పెరిగిందని కార్మికులు, ప్రజలు వాపోతున్నారు. పందుల స్వైర విహారంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– రెబ్బెన